క్లుప్తంగా

చెంగాళమ్మ సేవలో కలెక్టర్



కలెక్టర్, కుటుంబసభ్యులను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరిని తిరుపతి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి వారికి ఘనస్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

పెళ్లకూరు: మండల కేంద్రంలోని చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆదివారం డిక్సోన్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. డిక్సోన్ కంపెనీలో పనిచేసేందుకు నిర్వహించిన జాబ్‌మేళా ప్రత్యేక ఇంటర్వ్యూలకు 300ల మందికి పైగా హాజరయ్యారు. వీరిలో 150మందిని ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

నేడు వేలం పాట

దక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు వివిధ హక్కులకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సమక్షంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 9వ తేదీ నుంచి మే నెల 8 తేదీ వరకు వివిధ హక్కులకుగాను బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తారని ఈఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కోట: మండలంలో వరిసాగు ఆశాజనకంగా ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు. ఆదివారం కొత్తపాళెం, తిన్నెలపూడి రైతుభరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదును ఏఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంకా కొంతమంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదు కావాల్సి ఉందన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన వారు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి రైతులకు సాయం అందాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు కావాలన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

చిల్లకూరు: ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తిరుపతి జిల్లా సీఐటీయూ నేత వీవీ రమణయ్య సూచించారు. చిల్లకూరు దర్గా వద్ద ఆదివారం ఆటో కార్మికుల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు వాహనాన్ని నడిపే సమయంలో తప్పనిసరిగా ఖాకీ యూనిఫాం, లైసెన్స్, ఆటోకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. నేతలు ఎస్ ముత్యాలయ్య, తిరుపతి జిల్లా మున్సిపల్ కార్మికుల కార్యదర్శి గోపినాథ్, సీహెచ్ అంకయ్య, హర్షినాసాహెబ్, బాలాజి, మస్తాన్ పాల్గొన్నారు.

42 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పెళ్లకూరు: మండలంలోని పునబాకకండ్రిగ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 42 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కొంతకాలంగా పునబాక, పునబాకకండ్రిగ గ్రామాల కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ ఎస్ఐ రామస్వామి, సీఎస్ డీటీ ఓబయ్య సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దాడుల్లో 42బస్తాల రేషన్ బియ్యం, వ్యాపారి ఉయ్యాల భాస్కరయ్యలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు.

బంగారు చీరలో ముత్యాలమ్మ



చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం భక్తులకు బంగారుచీరలో దర్శనమిచ్చారు. మాఘపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి బంగారుచీరను అలంకరించారు. ఉదయం అమ్మవారికి పలు రకాల అభిషేకాలను చేశారు. అనంతరం భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గృహసారథులే విజయసారథులు కావాలి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



హాజరైన గృహసారథులు, జేఎస్‌సీ కన్వీనర్‌లు, వలంటీర్లు

– వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ గృహసారథులే రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయసారథులని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి బంగ్లాలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా బాలాయపల్లి మండల గృహసారథులు, జేఎస్‌సీ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి తిరుపతి జిల్లాలో ఏడు నియోజకవర్గాల కంటే వెంకటగిరిలోనే అత్యధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని అన్నారు. పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి, పార్టీ విధివిధానాలను ప్రతి గడపకు తీసుకెళ్లి వారిలో చైతన్యం తీసుకొచ్చేలా కష్టపడి పనిచేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకమన్నారు. దేశంలో ఏ రాజకీయపార్టీకి లేనంత పటిష్టమైన వ్యవస్థ వైఎస్సార్‌సీపీకి ఉందని, అందరం సమష్టిగా సమన్వయంతో పనిచేస్తే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవడం నల్లేరుపై నడకేనన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు సీహెచ్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని వివరించారు. బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ శింగంశెట్టి భాస్కర్‌రావు, జయంపు, నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు వి.కార్తీక్‌రెడ్డి, రంగనాథం, మండల జేఎస్‌సీ కన్వీనర్ తాళ్లూరు వెంకట బంగారుప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు బి మురళీమోహన్‌రెడ్డి, వాన పార్వతి, గోపికృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆర్ వెంకటకృష్ణమనాయుడు, వి సురేంద్ర, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జి ఢిల్లీబాబు, నేతలు చెలికం శంకరరెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, బండి రమేష్ రెడ్డి, టి.గణేష్‌రెడ్డి, వహీదా, యస్దాని పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

–సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంతో అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నాయుడుపేట మున్సిపాలిటీ ఎంఆర్ నగర్ సచివాలయ పరిధిలో జరిగింది. ఎమ్మెల్యే, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు జువ్వల పాళెం క్రాస్ రోడ్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ ఉపాధ్యాయ సంఘనాయకులు, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం అధ్యాపకులు, విద్యార్థి సంఘ నాయకులు వర్తక, వాణిజ్య సంఘ నాయకులు, మహిళలు పాల్గొని సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే సంజీవయ్యకు మద్దతుగా బ్యాడ్జీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. పలుచోట్ల ఎమ్మెల్యేకు గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జువ్వల పాళెం రోడ్డు, శ్రీరామ్ గర్, ఎంఆర్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ నారాయణరెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ మాధవరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణారెడ్డి, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, జయరామయ్య, కిషోర్ యాదవ్, కె.చెంచయ్య, చదలవాడకుమార్, సి.చెంగయ్య, పి.రాజేష్, ఏ బాబు, పి.రాహుల్, చిట్టిబాబు, భాను, దారా రవి, ఎన్‌సీఆర్, కలికి సుదీప్‌రెడ్డి, ఆవుల లోకేష్, కౌన్సిలర్‌లు అశోక్‌కుమార్, బంగారుబాబు, పి.నాగార్జున, షేక్ షబ్బీర్, సరిత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సదస్సులో మాట్లాడుతున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య

– ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

నాయుడుపేటటౌన్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. అదేవిధంగా సీఎం జగనన్న ఆశయాలను నిజం చేస్తూ కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో ఆదివారం సాయంత్రం నాయుడుపేట మున్సిపాలిటీ పరధిలో కొత్తగా నియామకం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ చదలవాడ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గతంలో చంద్రబాబు అధికారం కోసం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి ఘనత దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పార్టీ కి సంబంధించిన వారుగా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన అగ్ర వర్గాల వారికి సైతం సంక్షేమ పథకాలను అందించిన ఘనత కూడ సీఎం జగనన్నకే దక్కిందన్న విషయాలను అందరికి వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, నేతలు రాజారెడ్డి, సీహెచ్ కుమార్, జయరామయ్య, కె.చెంచయ్య, పి.హరినాథ్‌రెడ్డి, చంద్రారెడ్డి, దారా రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

గూడూరు: నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ధరణేశ్వర్‌రెడ్డిది ఆత్మహత్యకాదని, యాజమాన్య ఒత్తిళ్లే కారణమని, ఈ మేరకు బాధిత కుటుంబానికి అండగా నిలిచి పోరాడుతామని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ నాయకుడు నిఖిల్ సాయి పేర్కొన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నారాయణ కళాశాల యాజమాన్య ఒత్తిళ్ల కారణంగా ఎందరో విద్యార్థులు అశువులుబాశారన్నారు. అలాంటి వారిలో ధరణేశ్వర్‌రెడ్డి ఒకడన్నారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి తమ వంతుగా అండగా నిలిచి, సోమవారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు.

నేటి నుంచి డయల్ యువర్ మున్సిపాలిటీ

వెంకటగిరి: ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజలకు ఇంకా మెరుగైన సేవలందించేందుకు సోమవారం నుంచి డయల్ యువర్ మున్సిపాలిటీ కార్యక్రమం పని దినాల్లో ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గృహసారథులు పార్టీ ప్రతిరూపాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

– ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: గృహసారథులు వైఎస్సార్‌సీపీ ప్రతిరూపాలని, పార్టీకి ఎంతో కీలకమైనవారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని డాక్టర్ సీఆర్ రెడ్డి కల్యాణ మండపంలో 1 నుంచి 15 వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి విధులు, బాధ్యతలను ఆయన వివరించారు. ఎన్నికల ప్రచారం కోసం పార్టీ అధిష్టానం పంపిన సామగ్రి గురించి ఆయన వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా నియమించిన గృహసారథులు కష్టపడి పార్టీ కోసం ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలూ పనిచేస్తున్నారని చెప్పారు. జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నేతలు బత్తిని విజయ్‌కుమార్, గూడూరు రాజేశ్వర‌రెడ్డి, నాశిన నాగులు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు కె. రాఘవరెడ్డి, మనోజ్‌రెడ్డి, మోబీన్‌బాషా, ఏఎంసీ వైస్ చైర్మన్ గోవర్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా క్షీరాభిషేకం



108 క్షీర కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానంలో శుభకృత్ నామ సంవత్సరం మాఘమాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం క్షీరాభిషేకం, మహాచండీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దేవస్థానం నుంచి వేద పండితుల మంత్రోచ్చరణలతో మంగళవాయిద్యాలతో అష్టోత్తర క్షీర కలశాలను (108 కలశాలు) ప్రతిష్టించారు. అనంతరం అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన మహాచండీయాగాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిని అమ్మవారి వద్ద పూజలు చేయించుకుని ఉభయకర్తలు తీసుకొచ్చి హోమగుండంలో సమర్పించిన అనంతరం కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

రూ.10లక్షలతో ఆలయ అభివృద్ధి పనులు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు

తడ: మాంబట్టులో గ్రామంలో వెలసిన గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో ఎన్ఎం కండ్రిగ గ్రామానికి చెందిన కే రామచంద్రారెడ్డి, నిర్మల దంపతులు రూ.10లక్షల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ఈ క్రమంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, స్విమ్స్ వైదులు మునుస్వామి పాల్గొన్నారు.

జగనన్నది ఆదర్శ పాలన



మాట్లాడుతున్న ఎంపీపీ తనూజారెడ్డి

వెంకటగిరిరూరల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్రంలో సువర్ణ పాలన సాగిస్తున్నారని, పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని వెంకటగిరి ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను సైతం అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారం దిశగా రైతు భరోసా కేంద్రం, సచివాలయాలు, బల్క్‌మిల్క్‌కూలింగ్‌సెంటర్ వంటి వాటితోపాటు పంచాయతీల్లోనే శాశ్వత భవనాలను నిర్మించి గ్రామాల్లో అభివృద్ధి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి అంశాలపై మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి, నేతలు కాల్తీరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శివారెడ్డి, సతీష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం



గౌతమ్ (ఫైల్)



గౌతమ్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్‌రావు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఈనెల 3న మురుగు కాలువలో మృతి చెంది పడిఉన్న యువకుడి ఆచూకీని ఆదివారం పోలీసులు గుర్తించారు. మృతుడు అల్లూరి సీతారామరాజు జిల్లా, డూమ్‌రి గూడ మండలం, సోవ్వ గ్రామానికి చెందిన రూడి గౌతమ్(24)గా గుర్తించారు. మృతుడి తండ్రి రూడి గొరేష్ కుమారుడి కోసం వెతుకులాడుతూ నాయుడుపేటకు చేరుకుని కాలువలో అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నట్లు తెలుసుకున్నారు. గౌతమ్ నాయుడుపేటలో పశువులు సంతకు వచ్చాడని అయితే కాలువలో పడి ఎందుకు మృతిచెందాడో అర్థంకావడం లేదని, తన కుమారుడి మృతిపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తూ మృతుడి తండ్రి సీఐ ప్రభాకర్‌రావుకు విన్నవించారు. గౌతమ్ ప్రస్తుతం చెన్నైలో ఉన్న అస్లామ్‌తోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన ప్రభుధాన్ కుస్లాల వద్ద పనిచేస్తున్నాడని మృతుని కుటుంబసభ్యులు పోలీసులకు వివరించారు. మృతుడు గౌతమ్ గత నెల 30 తేదీ వరకు తమతో ఫోన్‌లో మాట్లాడారని రాత్రి తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు వెల్లడించారు. గౌతమ్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులు నాయుడుపేటలో పశువులకు సంతకు వచ్చారని వారిని పిలిచి మాట్లాడితే కొంత మేరకు మృతికి కారణం తెలుసు కోవచ్చన్నారు. యువకుడి మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని, అంతేకాకుండా పోస్టుమార్టం నివేదికలో కూడా మృతికి కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని సీఐ బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. గౌతమ్ మృతదేహానికి పోస్టుమార్టం జరిపి కుటుంబసభ్యులకు అప్పగించడంతో వారి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లారు

28 నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని మంగళంపాడు గ్రామంలోని సౌందర్యవల్లి రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సెల్వస్వామి తెలిపారు. 28వ తేదీ రాత్రి అంకురార్పణం, సేనై ముదలియార్ ఉత్సవం, 1న ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామిని దర్శించుకోవాలని కోరారు.

కారును ఢీకొన్న వ్యాన్ : నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన వాహనాలు

రాపూరు: ఆగివున్న కారును వెనుక నుంచి టమాట లోడు వ్యాన్ ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన రాపూరు-పెంచలకోన జాతీయ రహదారిలోని గోనుపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ క్రాంతి కుమార్ వివరాల మేరకు.. విజయవాడకు చెందిన ఏడుగురు పెంచలకోనకు వెళ్లి స్వామిని దర్శించుకుని తిరిగి నెల్లూరు వెళుతూ గోనుపల్లి వద్ద కారు ఆపినట్లు తెలిపారు. అదే సమయంలో కలువాయి నుంచి రాపూరు వైపు వెళుతున్న టమాట లోడు వ్యాన్ అదుపుతప్పి వెనుక నుంచి కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న గాంధీకి, జయలక్ష్మికి, జానకికి, ఉమామహేశ్వరి, వ్యాన్ డ్రైవర్ మహబూబ్ బాషాకు గాయాలైనట్లు చెప్పారు. వీరిని హైవే అంబులెన్స్‌లో రాపూరు ప్రభుత్వ వైద్యశాల్లో ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించినట్లు చెప్పారు.

ఘనంగా తాళమ్మకు నెల పొంగళ్లు



ప్రత్యేకాలంకరణలో తాళమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గూడూరు: గూడూరు గ్రామ దేవత తాళమ్మకు ఆదివారం ఘనంగా నెల పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారు భక్తులకు విశేష పుష్పాలంకరణలో ప్రత్యేకాకర్షణతో దర్శనమిచ్చారు. ప్రతి ఏటా గ్రామ దేవత తాళమ్మకు భోగి పండుగ మూడవ ఆదివారం నెల పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ మేరకు ఆదివారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకుని, పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యాలుగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ముసుగేసిన పొగమంచు



గూడూరు: కమ్మేసిన పొగమంచు



దొరవారిసత్రంలో..

గూడూరు: గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి, 10 గంటల వరకూ పొగమంచు దట్టంగా కమ్మేసింది. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

దొరవారిసత్రం: మండలం పరిధిలో ఆదివారం దట్టంగా పొగమంచు కమ్మేసింది. జాతీయ రహదారి, గ్రామీణ ప్రాంతం రోడ్లు, రైలు పట్టాలు అన్నీ దట్టంగా పొగ మంచుతో కమ్ముకుంది.